# కొంటె కోణంగి

శేఖర్ మనసు అస్తవ్యస్తంగా ఉంది. ఏదో విలువైనది చేయిజారిపోయినట్టుగా అనుభూతి. తన స్వంతం కాబోతున్నదానిని ఎవరో ఎత్తుకు పోతున్నట్లుగా భావిస్తున్నాడు. ఏమీ చేయలేక పోతున్నాననే తలంపుతో తనని తానే నిందించు కుంటున్నాడు.

ఒక ఆడదాని పొందుకోసం తాపత్రయ పడుతున్నాడు.

అతడు కోరుకునే ఆడది ఎవరో కాదు స్వయాన మరదలు రూప.

రూప అందాలన్నింటినీ తన కౌగిలిలో బందీ చేయాలన్న కోరిక తీరుతుందో... లేదో... అనిపిస్తుంది ఊహించుకుంటే. తను ధైర్యం చేయాలంటే తన సతీమణి వైదేహి ఇంట్లో ఉండ కూడదు. అప్పుడు తను ధైర్యం చేసి తన కోరిక తీర్చుకోగలడు. కానీ వైదేహి ఇంటిచూరును పట్టుకుని వేలాడే... దూలంలాగ ఇంట్లో ఉంటుందే తప్ప బయటకు పోదు. ఈ కారణం వల్లే తన కోరిక తీరదేమోనని మదనపడుతున్నాడు. దుర దృష్టవంతుడిగా అభివర్ణించుకుంటున్నాడు.

ఆఫీసుకి వచ్చిన శేఖర్ లీవ్ లెటర్ ఇచ్చి 'సిటీ'లో తన ఇంటికి బయలుదేరాడు.

బస్‌లో కూర్చున్న శేఖర్‌కి రూప సౌందర్యం కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తోంది. కళ్ళుమూసుకుని ఆమె సౌందర్యాన్ని ఓ కవిలా, భావుకుడిలా మారిపోయి అంచనా వేస్తున్నాడు.

రూప... ఎంత రమణీయంగా ఉంటుంది.

కోల ముఖం...

జలపాతం లాగ... జఘన భాగం వరకు సాగిపోయే శిరోజాల సంపద.

చక్రాల్లాగ... నేత్రద్వయం

సూదిగ... నాసిక

లక్క పిడతలాగ... నోరు.

చిన్నదిగా... వంపు తిరిగిన గడ్డం...

గుండ్రంగా... భుజాలు.

సమ్మోహనంగా... స్తనద్వయం...

మోహనంగా... ఉదరభాగం...

అద్భుతంగా, గుహలాగా... నాభిస్థానం...

ఇసుక తిన్నెల్లాగ... పిరుదులు.

పాలరాతి శిల్పంలాగ... శరీరచ్ఛాయ. ఇన్ని సలక్షణాల చిన్నది, పద్దెనిమిదేళ్ళ రూప తన బిగి కౌగిట బందీ అయినప్పుడే తన మనస్సుకి శాంతి... ఎలాగైనా... ఏ క్షణంలోనైనా తను ఆమెను అనుభవించాలి. అందుకు తగిన అవకాశం ఏర్ప రచుకోవాలి.

తన సతీమణికి తెలియకుండా గ్రంధాన్ని నడుపుతూ, గ్రంధసాంగుడిగా మారాలి. ఈ క్షణం నుండి ప్రతిక్షణం అదే ధ్యాసతో ఉండాలి.

దసరా శెలవులకని తన ఇంటికి వచ్చిన రూప తిరిగి వెళ్ళిపోయేలోగా పువ్వును నేలరానివట్లుగా, ఆమె సంపదనంతటినీ మగతనంతో తన స్వంతం చేసుకోవాలి.

తనకిటువంటి ఆలోచన రావడం తప్పే... కానీ ఆమె ప్రవర్తన తనలో పెద్దరికాన్ని తొలగించి టీనేజ్ యువకుడ్ని చేస్తూ కొత్త కోరికలు రేకెత్తిస్తోంది. లేకపోతే రూప జోలికి వెళ్ళి ఉండేవాడు కాదు.

బావా మరదళ్ళ సరసం తీపి అనుభవాలను రుచి చూపిస్తుంది. మధురస్మృతులను మిగులుస్తుంది.

ఈ ఉద్దేశ్యంతోనే శేఖర్ వారం రోజులు శెలవు పెట్టి ఇంటికి బయలుదేరాడు.

తను దిగవలసిన 'స్టాప్' రావడంతో శేఖర్ బస్ దిగి ఇంటికి బయలుదేరాడు.

★ ★ ★

ఆ రోజు శేఖర్ ఉదయం లేచిన దగ్గర్నుండి ఎక్కడకూ వెళ్ళకుండా ఇంట్లోనే కూర్చున్నాడు.

మధ్యాహ్నం పన్నెండు గంటలు కావస్తోంది.

వంటగదిలో వైదేహి వంటా, వార్పూ చేస్తోంది. ఆమెతోపాటే ఆమె చెల్లెలు రూప కూడా ఉంది. అలా ఉండే బదులు ఒంటరిగా ఉన్న తన దగ్గరకు వచ్చి మాట్లాడితే ఎంత బావుణ్ణు. అవకాశం దొరికితే స్వర్గానందమైనా పొందేవాడు. అలాంటి అవకాశమేదీ కలుగనివ్వకుండా తన మనసుని వశం తప్పించేటట్లుగా చేస్తూ దూరంగా ఉంటోంది.

రూపలో ఉన్న ఆ గుణమే శేఖర్‌కి నచ్చనిది.

రూపవచ్చి అప్పుడే రెండురోజులు గడచిపోయాయి. ఇప్పటికి తను సాధించిందేమీ లేదు, నయనానందం తప్ప.

రూప ఇంకా అయిదురోజులె ఉండ తర్వాత వాళ్ళ ఊరు వెళ్ళిపోతుంది... అప్పుడు తన కోరిక అసంతృప్తిగానే మిగిలిపోతుంది.

రూప వెళ్ళిపోతుందనే భావన రాగానే తన మనసు కలత చెంది వేదనకు గురి అవుతోంది.

ఆవేదన నిండిన మనసుతో, రకరకాల ఆలోచనలతో అన్యమనస్కంగా కూర్చున్నాడు శేఖర్.

"బావా... అక్క భోజనానికి రమ్మంటుంది త్వరగా రా" కనులు మూసుకుని ముకుళిత మనస్కుడై ఆలోచిస్తున్న శేఖర్ చెవుల దగ్గరకు వచ్చి గట్టిగా చెప్పింది రూప.

రూప పిలుపుకి ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు శేఖర్.

రూప బావని పిలిచి హంసలా నడుచుకుంటూ డైనింగ్ రూమ్‌లోకి వెళ్ళిపోయింది.

ఆమెను చూస్తూ ఆమెతో పాటే శేఖర్...

డైనింగ్ టేబుల్ దగ్గర ముగ్గురూ కూర్చున్నారు.

వైదేహి ముగ్గురికి వడ్డించింది.

శేఖర్ భోంచేస్తున్నట్లుగా నటిస్తూ, ఓ వైపు రూప వైపు కొంటెగా చూస్తున్నాడు. ఆమె కూడా చిరునవ్వులు నవ్వుతూ అతడిలో మోహపు దాహాన్ని అధికం చేస్తోంది.

వైదేహి మాత్రం తనమట్టుకు తను తింటోంది.

రూప దగ్గరే ఉన్న 'పికెల్'ని అడుగుతూ శేఖర్ "రూపా, ఆ పికెల్ కొంచెం వేయి" నవ్వుతూ అన్నాడు.

రూప, పికెల్‌ని అతడి అన్నంలో వేస్తూ పైట జారవిడిచింది.

వైదేహి ప్రక్కన కూర్చున్నా ఈ సంఘటనని గమనించనే లేదు.

"చాలా" అంది గోముగా రూప.

"ఊ... ఊ... చాలు... చాలు... చాలా బాగుంది" మనసు ఉండబట్టలేక ద్వంద్వార్థాల మాటని ఉపయోగించాడు శేఖర్.

"ఏమిటి బాగుంది?" వైదేహి కలుగజేసుకుంటూ అడిగింది.

"అదేనక్కా... నే వేసిన పచ్చడి... అంతే కదా బావ" బావను ప్రశ్నిస్తూ అంది రూప.

వైదేహి ప్రశ్నకు కంగారుపడ్డ శేఖర్ రూప చెప్పిన విషయాన్ని సమర్థిస్తూ "అవును— రూప చెప్పింది నిజమే. పచ్చడి చాలా రుచిగా ఉంది. మరి మీ అక్క వంట అంటే ఏమనుకున్నావు?" భార్యని ఒక ప్రక్కన పొగుడుతూ కొంటె చూపులు రూపవైపు చూస్తూ అన్నాడు.

వైదేహి భోజనం చేసి వెళ్ళిపోయింది. వైదేహి వెళ్ళిందే తడవు రూప కూడా వెళ్ళిపోయింది తగుదునమ్మా... అని.

ఆ రోజు రాత్రి కూడా రూపతో ఏకాంతంగా

మాట్లాడే అవకాశం వస్తుందేమోనని ఎదురు చూసాడు శేఖర్. కానీ ఆ రోజు కూడా తనకు ఆ అవకాశం కలగలేదు.

శేఖర్ మధ్య గదిలో కూర్చుని అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు.

ఉదయం పదకొండున్నర కావస్తోంది.

'సరిగ్గా ఆ క్షణమే... ఓ అద్భుత సౌందర్యరాశి... తన కలల స్వప్నం... తన చెంతకు రాబోతుందన్న సంగతి అతడెలా ఊహించగలడు.''

బయటకు ఎక్కడికో వెళ్ళిన రూప మండతో నడుస్తూ ఇంట్లోకి రావడం చూసి శేఖర్ ''రూపా... ఏమయ్యింది... అలా నడుస్తున్నావు?'' చదువుతున్న పేపర్ని ప్రక్కన పెట్టి అడిగాడు శేఖర్.

''బావా... ముల్లు గుచ్చుకుంది.''

''ఎక్కడ'' అడిగాడతడు.

''ముల్లు ఎక్కడ గుచ్చుకుంటుంది. నా అరికాలి క్రింద.'' సమాధానం చెప్పిన రూపని ఆపి ''ముల్లు నేను తీస్తాను... ఇలారా'' ఇదే మంచి ఛాన్సనుకుని తన దగ్గరకు రమ్మన్నాడు శేఖర్.

''వద్దు బావా... అక్క తీస్తుందిలే... నేనక్క దగ్గరకే వెళ్తున్నా నువ్వు పేపర్ చదువుకో'' అని కిచెన్ రూమ్‌లోకి వెళ్ళింది రూప.

వచ్చిన అవకాశం చేజారిపోయినందుకు తలని గోడకేసి బాదుకున్నంత పనిచేసాడు శేఖర్.

అంతలో లోపలి నుండి వైదేహి మాటలు వినబడసాగాయి.

''మీ బావగారు ముల్లు బాగాతీస్తారు... మీ బావ దగ్గరకు వెళ్ళు'' వైదేహి మాటలు వినబడ్డ శేఖర్‌కి.

''యురేకా'' అన్నంత హుషారు వచ్చింది అయినా ఆనందాన్ని పైకి తెలియనీయకుండా బింకంగా కూర్చున్నాడు.

''వద్దక్కా... నాకు సిగ్గేస్తోంది'' రూప మాటలు మళ్ళీ అతడిలో కలవరం కలిగిస్తున్నాయి.

తన దగ్గరకు రూప వస్తుందా... రాదా... అన్న ఉద్రిక్తత.

చకోరపక్షిలా ఎదురుతెన్నులు రూప కోసం.

''నీ సిగ్గు సితకలెయ్య... బావ దగ్గర సిగ్గేంటి? వెళ్ళి ముల్లు తీయించుకో'' వైదేహి దెబ్బలాడడంతో మధ్య గదిలో ఉన్న బావ దగ్గరకు రావడానికి వెనుతిరిగింది రూప.

అన్నీ గనిస్తున్న శేఖర్ మరింత సీరియస్‌గా ఉన్నాడు.

శేఖర్ దగ్గరకు వచ్చిన రూప అతడి ప్రక్కనే కూర్చుంటూ ''బావా! ముల్లు త్వరగా తీయి. చాలా బాధగా ఉంది'' అంది కాలు అతడికిస్తూ.

''ఏం? ఇందాక తీస్తే వద్దన్నావుగా.''

''సర్లే బావా! ఇప్పుడు తియ్యమంటున్నాగా''



బాధని మునిపంట నొక్కిపెడుతూ అంది రూప.

మరింక మాటలు పొడిగించడం ఇష్టం లేక శేఖర్, రూప కుడికాలు పాదమందుని తన చేత్తో పట్టుకొని, ఆమె అరికాలులో గుచ్చుకున్న ముల్లును మృదువుగా తీసాడు.

తను అడ్వాన్సు అవడానికి ఇదే మంచి సమయ మనుకొని ఆమె కాలి పిక్కలని మృదువుగా నొక్కాడు.

బావ చేసిన చిలిపి పనికి నవ్వు వచ్చిన రూప "ఏయ్ బావా ఏమిటది? అక్క చూస్తే బాగుండదు" అంది సిగ్గుతో వంకరలుపోతూ.

రూప అపురూపంగా తన ఒడిలోకి వచ్చి పడుతోందన్న విషయం ఆ మాటతో రూఢి అయిపోయింది శేఖర్‌కి.

"మీ అక్క చూడకపోతే అడ్డుండదుగా" అన్నాడు ధైర్యం చేసి.

"ఊ..." తలదించుకుంటూ అంది రూప.

"నా ముద్దుల రూప" అంటూ గులాబీ రంగు లాంటి ఆమె చెక్కిళ్ళపై మృదువుగా గిల్లాడు శేఖర్.

"బావగారు... మంచి గ్రంధసాంగుడిలా ఉన్నారే."

'ఊ... నేనెప్పుడూ గ్రంధసాంగుడ్నే... అపర కృష్ణుణ్ణి... సర్లేకాని రూప మన దాహాలు తీరే రోజెప్పుడో చెప్పుతావా" అడిగాడు శేఖర్.

"ఎల్లుండి ఉదయాన్నే నేను వెళ్ళిపోతాను కాబట్టి "రేపు రాత్రి పెరట్లో నేనొక్కర్తినే పడుకుంటాను మీరు వచ్చి మీ ముద్దుముచ్చటలు తీర్చుకోండి... మరి అక్కను ఎలా తప్పిస్తారో" చెప్పింది రూప.

"మీ అక్కను తప్పించడం ఎంతసేపు... అదేమీ బ్రహ్మ విద్యకాదుగా... రేపు ఎంత లబగా వచ్చి నీ ఒడిలో వాల్తానో చూస్తావుగా" అన్నాడు ఆమె పెదవులను తన చూపుడు వేలు. బొటన వేలుతో కలిపి మృదువుగా లాగుతూ.

అంతలో కిచెన్ రూమ్‌లో నుంచి వైదేహి "రూపా... బావగార్ని డైనింగ్ రూమ్‌లోకి రమ్మను. అన్నం వడ్డిస్తాను" అంది.

అక్క మాటలు విన్న రూప "వస్తాను బావా... రేపు మర్చిపోకు" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

యవ్వనాన్నంతా తన శరీరపు వంపులో గుప్తంగా దాచుకుని వెళ్ళిపోతున్న మరదలు రూపని చూస్తూ ఉండిపోయాడు శేఖర్.

మరుసటి రోజే రూప తన స్వంతం కాబోతుందన్న ఆశతో, అనిర్వచనీయమైన ఆనందంతో, రేపు ఎదురుకాబోయే మధురానుభూతిని తలుచుకుంటూ... ఊహల ఉయ్యాలలో ఆనందంగా ఊగుతూ... ఆ రోజంతా గడిపాడు శేఖర్.

★ ★ ★

ఆరవ రోజు రాత్రి పన్నెండు గంటలు కావస్తోంది.

వైదేహి ఆదమరిచి నిద్రపోతుంది.

వైదేహి నిద్రపోయిందని రూఢి చేసుకున్న తర్వాత బెడ్‌రూమ్ తలుపు బయట గొళ్లెం పెట్టి మెల్లగా... పిల్లిలా అడుగులు వేసుకుంటూ పెరట్లోకి వెళ్ళాడు.

పెరట్లో మల్లెపందిరి చెట్టుకింద మంచం వేసి ఉంది.

సిగ్గుతో అటు తిరిగి కూర్చున్న రూప తలదించుకుని ఉంది.

వెనుకమాటుగా రూప దగ్గరకు చేరుకున్న శేఖర్ "రూపా! నీ పొందుకోసం ఎంతగానో పరితపిస్తున్నాను. నీ ఒడిలో తలపెట్టుకుని పడుకోవాలని, నీ కేశ సంపదను సవరిస్తూ, అమృతం ఒలికే ఆ పెదవుల మధురాన్ని గ్రోలాలని... ఎంతగా ఆరాటపడుతున్నానో నీకేం తెలుసు. ఒకవైపు మీ అక్కడ చూస్తుందేమోనన్న భయం... మరొకవైపు నువ్వు నా పందిట వాలతావా, వాలవోనన్న సందిగ్ధత, తెలియని వ్యాకులత... ఈ ఊగిసలాటలోనే క్షణమొక యుగంలా రోజులు గడిపాను. చివరికి ఈ రోజు నా కల ఫలించింది. నువ్వు నా ఎద సందులో తలదాచుకునే అద్భుత ఐడియ వచ్చింది.రా... రూపా... నా సన్నిధిలో మేను మరచిపో... ఈ బావ కోరిక తీర్చు" అంటూ మృదువుగా ఆమె భుజాలపై నొక్కాడు.

"అక్క పడుకుందా" అడిగిందామె.

"ఊ..."

"నేను కూడా ఈ సమయం కోసమే ఎదురు చూస్తున్నాను. రా బావా... నా యవ్వనపు సోయగాలన్నీ నీ కోసమే" అంటూ వెను తిరిగింది.

అంతే...

అప్రతిభుడయ్యాడు శేఖర్.

'నోటపెగలక... నిజం తెలిసిపోయినాసరే ధైర్యం తెచ్చుకుని "వైదేహి... నువ్వా!" అన్నాడు.

"అవును... నేనేనండి... మీకు తెలియకుండానే కిచెన్ రూమ్‌లో నుండి ఇక్కడకు వచ్చి కూర్చున్నాను. రూప కూర్చోవలసిన ఈ చోటులో నేను కూర్చున్నానెందుకా... అని ఆశ్చర్యపోతున్నారా... ఇది రూప ఆడిన నాటకం. మీ మగరాయుళ్ళ బుద్ధి తెలుసుకోవడంలో తను ఆడిన నాటకమే ఇది. ఇందులో తనే గెలిచింది... నేను ఓడిపోయాను" వైదేహి అసలు సంగతి చెబుతుంటే నోటమాటరాక, నివ్వెరపాటుతో స్తంభీభూతుడౌతూ చూస్తున్నాడు శేఖర్.

అంతలో గదిలో నుండి పెరట్లోకి వచ్చిన రూప "అవును బావా... ఇది నేను ఆడించిన నాటకమే. శెలవుల్లో నేనిక్కడ సరదాగా గడిపి వెళ్ళిపోదామనే అనుకున్నాను. తీరా వచ్చాక మా అక్క మిమ్మల్ని శ్రీరామచంద్రుడని... ఆడది నగ్నంగా తనముందు నిల్చున్నా... ఏమీ చేయని ఏకపత్నీవ్రతుడని మెచ్చుకుంటుంటే ఉండబట్టలేక పందెం కాసాను.

మీరు శ్రీరామచంద్రుడు కాదని, ఆడదాని చేష్టలకి, ఆమె వయ్యారాలకి లొంగిపోయే సామాన్య మానవులేనని అక్కకి తెలియచెప్పడానికే మీ ముందు అంత చనువుగా ప్రవర్తించాను. నా వలపు చేష్టలతో మిమ్మల్ని కవ్వించాను" విషయం పూర్తిగా చెప్పింది రూప.

"అక్కా... ఇప్పుడు చెప్పు... బావగారు నువ్వన్నట్లు శ్రీరాముడా లేకపోతే శ్రీకృష్ణుడా" నవ్వుతూ అక్కని అడిగింది రూప.

"రూపా... నువ్వే గెలిచావు. నా భర్త శ్రీరాముడు కాదు. శ్రీకృష్ణుడే. ఆడదాని పొందుకోసం ఆరాటపడే సామాన్య మానవుడే మీ బావ" అంది నవ్వుతూ వైదేహి.

అవమాన భారంతో తప్పుచేసినవాడిలా నిల్చుని ఉన్న శేఖర్ దగ్గిరకు వెళ్ళి రూప "బావా! ఈ కొంటెకోణంగి ఆడిన నాటకం ఎలాఉంది? ఇకముందైనా అక్కను పువ్వుల్లో పెట్టిచూసుకో. అక్క కన్నా నేనేమీ అందగత్తెను కాను. ఈ మరదలు పిల్ల చేసిన ఈ చిన్న తప్పుని క్షమిస్తారని అనుకుంటాను" అని గదిలోకి వెళ్ళిపోయింది రూప.

ఆమెతోపాటే వైదేహి తన గదివైపు అడుగులేసింది.

ఆ రోజు మధురమైన రాత్రిగా మిగులుతుందనుకున్న శేఖర్‌కి అది ఒక విషాద రాత్రిగా మిగిలింది.

తప్పుగా ప్రవర్తించిన తను వైదేహి అడుగులో అడుగు వేసుకుంటూ ఆమె రూమ్ వైపే నడుస్తున్నాడు క్షమాభిక్ష కోరుతుదామన్న తలంపుతో.

అవునుమరి—

ప్రస్తుతం వైదేహి క్షమాభిక్షతోనే అతడు మనిషిగా మారేది.